www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 14 జనవరి 2023 | 5 | కాకినాడ





కడియం మండలంలోని పల్ల వెంకన్న నర్సరీలో సంక్రాంతిని పురస్కరించుకొని పువ్వులు , మొక్కలు కూర్పుతో 'గాలిపటం'ను రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు బాదుడు

- ఇష్టారాజ్యంగా ట్రావెల్స్ యజమాన్యాలు - రెట్టింపు చార్జీలు వసూలు
- సామాన్యులపై భారం - పట్టించుకోని అధికారులు



ప్రైవేట్ బస్సు వద్ద ప్రయాణికుల పడిగాపులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

యు. కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామానికి చెందిన కార్తీక్ చెన్నై నుంచి రెండు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. సాధారణ రోజుల్లో రూ. 1300 నుంచి 1500 ఉండే బస్సు చార్జీ రూ.2,800 వరకు వసూలు చేసినట్లు తెలి పారు. ఇలా అనేకమంది రెట్టింపు చార్జీలు ఇచ్చి ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ వేళ సామాన్యులపై రవాణా చార్జీల భారం తప్పడం లేదు. పొట్ట కూటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన పేద, మధ్యతరగతి వర్గాల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఏపిఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినా సాధారణ టిక్కెట్ ధరలనే వసూలు చేస్తున్నారు. అయితే పండక్కి జిల్లాకి వచ్చేవారు సంఖ్య అధికంగా ఉండడంతో ఆర్‌టిసి సేవలు సరిపోవడం లేదు. మరోవైపు సామాన్యుడికి అందుబాటులో ఉండే రైల్వే టికెట్లు నిండుకోవడంతో తిప్పలు తప్పడం లేదు.ఈ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్ బస్సులను ఆశ్రయించక తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం కాకినాడ, రాజమహేంద్ర వరం, రాజోలు,తుని, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి రోజుకి సుమారు 80 బస్సులు బయలుదేరుతున్నాయి. వాటికితోడు జిల్లా మీదుగా మరో 50 బస్సులు ప్రయాణిస్తున్నాయని ఒక అంచనా. ఇవి కాకుండా జిల్లాకు పలు బస్సులు వచ్చి చేరుతున్నాయి.

రెట్టింపు వసూలు

హైదరాబాదు నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, అమలా పురం వంటి ప్రాంతాలకు సాధారణ రోజుల్లో రూ.1070 టిక్కెట్ ధర ఉంటే ఇప్పుడు రూ.2 వేలు పైనే వసూలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో బ్లాక్ చేసి ధరలను పెంచుతున్నారు. బెంగళూరు నుంచి ఉమ్మడి జిల్లాకు మాములు రోజుల్లో రూ.2వేలు అయితే ఇప్పుడు 3,500, నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. తిరుపతి నుంచి రూ.1600 నుంచి 1800 ఉంటే రూ.2,500 నుంచి రూ.3వేలు వసూలు చేస్తున్నారు. స్లీపర్ బెర్త్ కు రూ.500 అదనంగా తీసుకుంటున్నారు. లగేజీ ఛార్జీలు వసూలు చేయకూడదనే నిబంధనలు న్నప్పటికీ చిన్న చిన్న లగేజీలకు కూడా రూ. 200లకు పైగా వసూలు చేసేస్తు న్నారని ఆరోపణలు ఉన్నాయి.. ప్రైవేటు ట్రావెల్స్ దందాపై నియంత్రణ లేకపోవడంతో వారి దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోతుందని ప్రయాణికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామని, చర్యలకు ఉపక్రమిస్తున్నామని చెప్పుకొస్తున్న రవాణా శాఖ అధికారులు ఎక్కడా కనిపించడం లేదు.



కొమరగిరి ఇళ్ల నిర్మాణం ప్రాంతాల్లో పర్యటిస్తున్న సిపిఎం బృందం.

ఇళ్లను నాణ్యతగా నిర్మించాలి

-కొమరగిరిలో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లపథకంలో భాగంగా కాకినాడ నగర వాసులకు కొమరగిరి ప్రాంతంలో నిర్మిస్తున్న ఇళ్ల సముదాయంలో శుక్రవారం సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణానికి పూనుకోవడం అభినంద నీయమన్నారు. అయితే కాకినాడ నగరానికి కొమరగిరి ప్రాంతం 10 కిలో మీటర్లు ఉంటుందన్నారు. ఉపాధి కోసం గ్రామాలు వదిలిపెట్టి నగరానికి వచ్చిన పేదలు నివాసం కోసం మరలా గ్రామానికి వెళ్లవలసి వస్తోందన్నారు. ప్రభుత్వం ఉపాధి కల్పన గురించి కూడా ఆలోచించాలన్నారు. ప్రభుత్వం ఇళ్లనిర్మాణానికి లబ్ధిదారులకు రూ.లక్షా 80 వేలు మంజూరు చేస్తోందని, డ్వాక్రా ద్వారా మరొక రూ.లక్ష రుణం వస్తోందని, కానీ పూర్తి స్థాయిలో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు అవసరం అవుతుందన్నారు. దీనివల్ల లబ్దిదారులు అప్పులపాలై ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ప్రభుత్వమే బాధ్యత వహించాలని, లబ్దిదారులకు ఆర్థిక సహాయం పెంచాలని కోరారు. అలాగే ఆ ప్రాంతంలో కొన్ని కన్స్ట్రక్షన్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అయితే లబ్ధిదారుల వాటాగా వారికి రూ.35 వేలు చెల్లించగా, మరొక రూ.లక్షా 45 వేలు బ్యాంకు రుణం మంజూరుతో మొత్తంగా రూ.3.60 లక్షలకు కొన్ని ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు గమనించామన్నారు. అయితే 17 వేలకు పైగా లబ్ధిదారులకు సగం స్థలాలు ఏ నిర్మాణం లేకుండా నేటికీ ఖాళీగానే ఉన్నాయన్నారు. మరికొన్ని పునాదులలోనే నిలిచి పోయాయని, సుమారు 15 కుటుంబాలు మాత్రమే వచ్చారని, వారు కూడా ఎన్నో వ్యయప్రయాసలు భరించి నివసిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల నిర్మాణం నాణ్యతగా, వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆ ప్రాంతం నుండే నగర పాలక సంస్థ కమిషనర్ కె.రమేష్‌తో శేషబాబ్జీ ఫోన్‌లో మాట్లాడగా సానుకూలంగా స్పందించారు. సంక్రాంతి అనంతరం సిపిఎం తరపున వినతిపత్రం సమర్పి స్తామని కమిషనర్‌కు తెలిపారు. ఈ పర్యటనలో పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకట రమణ, మలక వెంకట రమణ పాల్గొన్నారు.

పండుగ రద్దీ

రైల్వే స్టేషన్‌లలో సంక్రాంతి ప్రయాణీకుల కిటకిట



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో కిటకటలాడుతున్న ప్లాట్‌ఫామ్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రెండో పెద్ద రైల్వే స్టేషన్ అయిన సామర్ల కోట రైల్వే స్టేషన్ శుక్రవారంసంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణి కులతో కిటకిటలాడింది. పండుగ మూడు రోజులు సెలవులు కావడంతో పండగకు వారి గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు బయలుదేరి రావడంతో సామర్లకోట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాలు ప్రయాణికులతో కిటకిటలడాయి. ఏ రైలు ఆగినా వందల సంఖ్యలో ప్రయాణికులు భోగి ఎక్కేందుకు ఎగబడుతూండటంతో భద్రతా చర్యల విషయంలో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీ సులు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రయాణికులను క్రమబద్ధీకరి స్తున్నారు. అయితే సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా స్టేషన్‌లో ప్రయాణి కుల సంఖ్య విపరీతంగా పెరగడంతో ప్రయాణికుల అవసరాలను బట్టి ప్రత్యేక రైళ్లను నడపేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక రైల్వే ఎస్ఎం రమేష్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇటు రైళ్లు, అటు బస్సులు ఖాళీ లేకుండా రాకపోకలు సాగిస్తుండడంతో చిన్న వాహనదారులైన ఆటో యజమానులకు మంచి ఉపాధి లభించినట్టయింది. కాగా టిక్కెట్లు పొందే విషయంలోనూ ఆ రైళ్లను అందుకునే విషయంలోనూ సమయం సరిపడక ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బుకింగ్ కౌంటర్‌ల వద్ద ప్రయాణీకులు క్యూలైన్ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న ప్రయా ణికులు స్టేషన్‌కు వెళ్లగా, సాధారణ ప్రయాణికులు బుకింగ్ కౌంటర్ల వద్ద టిక్కెట్ల కోసం బారులు తీరారు. రైళ్లలో చోటు దొరకని ప్రయాణికులు కాకినాడ వెళ్లి ఆర్‌టిసి బస్సులను ఆశ్రయించారు.

పందేనికి సై

జోరుగా బరులు ఏర్పాటు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో జోరుగా కోడిపందేలకు బరులు వెలిశాయి. పోలీసుల ఆంక్షలను బేఖాతరు చేస్తూ జూదరులు పలుచోట్ల బరులు సిద్ధం చేశారు. దీనిని బట్టి చూస్తే భోగి రోజు నుండి కనుమ వరకు సంక్రాంతి కోడిపందాలు సందడి చేయనున్నాయి.



తాళ్ళరేవు మండలం సుంకరపాలెం లో కోడిపందాలకు వెలసిన బరి



ఖాళీ స్థలాల యజమానులను హెచ్చరిస్తున్న ఎస్ఐ విద్యాసాగర్, తహశీల్దార్ శాస్త్రి

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని గ్రామాల్లో కోడిపందాలు గుండట పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఏలేశ్వరం ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రెవెన్యూ అధికారులతో కలిసి పందాలు నిర్వ హించే ప్రాంతాల్లో జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థలాల యజమానులకు సైతం ముందస్తు హెచ్చరికలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ జాయింట్ ఆపరేషన్‌లో ఏలేశ్వరం తహశీల్దార్ ఏ విశ్వనాథ శాస్త్రి, వీఆర్వోలు అవసరాల కిషోర్, మణికంఠ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా

సకాలంలో సరుకులు పంపిణీ


ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో మధ్యాహ్నం భోజన పథకానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు సకాలంలో సరుకుల పంపిణీ చేసే విధంగా అధికా రులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్లో జేసీ ఇలాక్కియా పౌరసరఫరాల కార్పొరేషన్, డిప్యూటీ తహశీల్దార్లు, ఎండియు వాహనదా రులతో ఇంటింటికి సరుకుల పంపిణీ, ఎండియు వాహనాల నిర్వహణ, సరుకుల నిల్వ కేంద్రాలు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెల పేద ప్రజలకు అందిస్తున్న బియ్యం ఇతర నిత్యవసర సరుకులు జాప్యం లేకుండా పంపిణీ చేయాలన్నారు. తప్పనిసరిగా ఎండీయు వాహనాలు ద్వారా ఇంటింటికి సరుకులు పంపిణీ చేపట్టాలని, ప్రాధాన్యతాక్రమంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మధ్యాహ్నం భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యతతో, బరువులో వ్యత్యాసం లేకుండా సరుకుల పంపిణీ చేయాలని జేసీ ఇలక్కియ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో డిఎస్ఓ డి.చాముండేశ్వరి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.పుష్పమణి, వివిధ మండలాల డిప్యూటీ తహశీల్దార్లు, ఎండీయు వాహనదారులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

16న స్పందన రద్దు

కనుమ పండుగ పురస్కరించుకుని ప్రభుత్వ శెలవు దినం అయిన కారణంగా 2023 జనవరి 16వ తేదీ సోమవారం స్పందన ప్రజా విజ్ఞాపన స్వీకరణ కార్యక్రమం ఉండదని కలెక్టర్ కతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని కలెక్టర్ కోరారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం



శంఖవరంలో బహుమతులు అందజేస్తున్న ఎస్.పి రవీంద్రనాథ్‌బాబు

ప్రజాశక్తి -అన్నవరం(శంఖవరం)

నేటి సమాజంలో యువతకు శారీరక దఢత్వానికి క్రీడలు దోహదపడతాయని ఎస్.పి రవీంద్రబాబు పిలుపు నిచ్చారు. సంక్రాంతిని పురస్కరించుకుని శంఖ వరంలో ఎస్.పి రవీంద్ర బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.పి మాట్లా డుతూ మన సంప్రదాయాలు, సంస్కతిని మరచిపోకుండ, కాపాడా లనే సదుద్దేశంతో తమ పోలీస్ శాఖ వివిధ ప్రజాప్రతినిధులు సహకారంతో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో నిర్వహించడం శుభ సూచిక మన్నారు. తొలుత ఎస్.పి రవీంద్ర బాబు స్థానిక ఎమ్.ఎల్.ఏ పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్‌తో కలసి మహిళలు వేసి న ముగ్గులు ను,చేతి వత్తులు నిర్వ హించే కళ లను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్పి పి.శ్రీనివాస్‌రావు, డి.ఎస్.పి వెంకటేష్ రావు, ఎంపిపి పి.రాజబాబు, సి.ఐ కిషోర్ బాబు, గ్రామ సర్పంచ్‌లు, యం.డి.ఓ రాంబాబు ఎస్.ఐ శోభన కుమార్ ల్గున్నారు. **గండేపల్లి** మండలం మురారిలో వసంత్ యువసేన ఆధ్వర్యంలో రామాలయం వద్ద ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథిగా ఎంపీపీ చల్లగళ్ల దొరబాబు, జాస్తి వసంత్ బహుమతులు అందజేశారు. ఎన్‌టి రాజపురం శివారు పామాయిల్ తోటలో పరిమిబాబు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించగా, విజేతలకు జడ్పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు గ్రామ సర్పంచ్ బిక్కిన దేవిదుర్గ, గ్రామ పెద్దలు విజేతలకు బహుమతులు అందజేశారు. పి నాయకంపల్లిలో మళ్లీ రెడ్డి పాపారావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిం చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ చెల్లగళ్ల దొరబాబు, మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎస్.పి రవీంద్రనాథ్‌బాబు

మల్లవరంలో డే అండ్ నైట్ కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

పి. మల్లవరంలో శుక్రవారం సాయంత్రం డే అండ్ నైట్ కబడ్డీ పోటీలను మల్లవరం గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫ్లడ్ లైట్స్ కాంతుల్లో స్థానిక ముత్యాలమ్మ ఆలయం ఎదుట మహిళలకు, పురుషులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. మహిళా కబడ్డీ పోటీల ప్రారంభ మ్యాచ్ రామన్న పాలెం - భైరవపాలెం జట్ల మధ్య జరుగగా రామన్నపాలెం విజేతగా నిలి చింది. తాళ్లరేవు - సుంక టరేవు జట్ల మధ్య జరిగిన పురు షుల కబడ్డీ పోటీలో తాళ్లరేవు జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో గెలిచిన వారికి నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజే యనున్నట్లు నిర్వాహకులు దూళిపూడి నాగేంద్ర ప్రసాద్, ధూళిపూడి వెంకటరమణ, ముత్యాల జయలక్ష్మి తెలిపారు. కార్యక్ర మానికి కట్నం శ్రీనివాస్, ఏడిద సూర్యప్రకాశరావు, ధూళిపూడి ఆదినా రాయణ కుమారులు, రావూరి సతీష్ అండ్ రజని తదితరులు సహకారం అందించినట్లు తెలిపారు.



పి.మల్లవరంలో రామన్నపాలెం, బైరవ పాలెం మహిళా కబడ్డీ జట్టుతో నిర్వాహకులు



అద్దేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

అద్దేపల్లికి ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజాకవి, నిత్యసాహితీ సంచారి డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు 7 వ వర్ధంతి సభ కాకినాడ గాంధీభవన్‌లో శుక్రవారం సాహితీ స్రవంతి ఆధ్వర్యాన నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు, అధ్యక్షతన జరిగిన సభ ముఖ్య అతిథిగా సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు శ్రీకెంగార మోహన్ హాజరయ్యారు. అతిథులకు నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి స్వాగతం పలికారు. తొలుత సభ్యులు అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. గరికపాటి మాష్టారు అద్దేపల్లిపై రాసిన గేయాన్ని, అద్దేపల్లి రాసిన గజల్‌ను మేడిశెట్టి శ్రీరాములు గానం చేశారు. ఒకే వ్యక్తి కవి, పండితుడు, వక్త, గురువు, ప్రోత్సాహకుడు, స్నేహశీలి కావటం ఒక అరుదైన విషయమని, అద్దేపల్లి అలాంటి ఒక అరుదైనవ్యక్తి అని కష్ణబాబు అన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన కెంగార మోహన్ ప్రపంచీకరణపై అద్దేపల్లికి సంబంధించిన రచనల్ని ముఖ్యంగా ఆయన "కాలంమీద సంతకం" అనే కవితాసంపుటిలోని అంశాలను విపులంగా సమీక్షించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీగనారా, శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి, శ్రీమతి పసుమర్తి పద్మజవాణి, కొత్త శివ, సాయి సత్యనారాయణలు అద్దేపల్లిని గూర్చి ఆయనతో తమ అను బంధాన్ని గూర్చి స్మరించుకున్నారు. కార్యక్రమంలో గౌరీనాయుడు, గరికపాటి మాష్టారు, అద్దేపల్లి ప్రభు, ఇంద్రగంటి, రామస్వామి, ఉండవల్లి, జ్యోతి, ఇందిర, ప్రభాకరవర్మ, సయ్యద్ సాలార్, కృష్ణారావు, చింతపల్లి సుబ్బారావు, అశోక్ కుమార్, విష్ణు తదితర కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం


మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.సురేంద్ర అధ్యక్షతన శుక్రవారం జరిగిన సభలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న 47 మంది పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మిలు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పప్పల దుర్గారావు, తాటికొండ వెంకట లక్ష్మి, గుర్రాల మార్త,ఆరేళ్ల వీరరాఘవ,కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ,బొడ్డు ప్రకాష్,గుర్రాల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు పాల్గొన్నారు. **తాళ్లరేవు మండలం** గాడిమొగ పంచాయతీ పారిశుధ్య, పంచాయతీ సిబ్బందికి స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ ,వార్డు సభ్యులు దుస్తులు పంపిణీ చేశారు. పాలకవర్గ ఆమోదంతో పారిశుధ్య సిబ్బందికి, పంచాయతీ సిబ్బంది 41 మందికి యూనిఫాంతో పాటు, ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, వార్డు సభ్యులు అరదాడి ఆదినారాయణ, పోతబత్తుల కష్ణ, కామాడి కష్ణ జ్యోతి, ఈశ్వరి, పినపోతు ఈశ్వరి, వనమాడి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి గండేపల్లి

మండలం మల్లేపల్లి సచివాలయంలో డిడిఓ, మల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి కట్టా చంద్రశేఖర్ తన సొంత ఖర్చులతో మహిళా వాలంటీర్లకు, మహిళా సిబ్బందికి చీరలు, వాలంటీర్లకు, సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో మల్లేపల్లి సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, ఉప సర్పంచ్ దొమ్మ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అంగన్‌వాడీల్లో సంక్రాంతి సంబరాలు



కాజులూరు మండలం జగన్నాథగిరి లో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తూరంగి అల్లూరి సీతారామరాజు కోలనీ అంగన్‌వాడీ సెంటర్లో బొమ్మల కొలువు, మట్టితో బొమ్మలు తయారు చేయడం, మైండ్ గేమ్స్ తో శుక్రవారం సంక్రాంతికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ సిహెచ్.విజయ మాట్లాడుతూ ఈనెల 14 తేదీన మహిళలకు ముగ్గుల పోటీ, పెద్దలకు టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు, 15 వతేదీన గాలి పటాల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మొమ్మల కొలువు పోటీలో వందమంది బాలబాలికలు తమ బొమ్మలతో పాల్గొన్నారని తెలిపారు. కీర్తిశేషులు చింతపల్లి అప్పారావు అప్పారావు అభ్యు దయ వేదిక ఆధ్వర్యంలో 15వ తేదీన బహుమతి ప్రదానం అనంతరం కూచిపూడి, భరతనాట్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన పేలూరి మహాలక్ష్మి నృత్యప్రదర్శన జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కె.శుభారాణి, డి.రత్నం, చింతపల్లి శివకుమార్, చింతపల్లి శ్రీరమణి, సచివాలయ కార్యదర్శి రేవతి, నీరజ, ఎంఎస్ కె గౌరీశంకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఈశ్వరి, ఏఎన్ఎం పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక 1, 2 వార్డుల పరిధిలోని 4 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి శుక్రవారం పాత పెద్దాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు ఆరేళ్ల వీర రాఘవ, ఆకుల కృష్ణ బాపూజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బాలలు అత్యంత ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు తులసి, జయ, స్నేహలత, ఉమాదేవి, ఆయాలు జయ, మేరీ, సుజాత, కపామణి తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని గొల్లపాలెం సెక్టర్ పరిధిలో జగన్నాథగిరి గ్రామంలో సర్పంచ్ అచ్చుతాంబ అరుణ అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా తాళ్ళరేవు ఐసిడిఎస్ సిడిపిఓ మాధవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంక్రాంతి సంబరాలలో ముగ్గుల పోటీలు చిన్నారులకు భోగి పళ్లు, సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేశ్వరరావు అంగన్‌వాడీ సూపర్వైజర్లు అన్నపూర్ణ కనకరత్నం అంగన్వాడి సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది వైద్య సిబ్బంది అంగన్‌వాడీ వర్కర్లు సహాయకులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పెద్దాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు



తూరంగిలో బొమ్మల కొలువుకు వచ్చిన చిన్నారులు



పోడియం వద్ద బైఠాయించిన ఎంఎల్ఏ గ్రూపు

వైసిపిలో మరోసారి తెరకెక్కిన విభేదాలు

- రసాభాసగా ఏలేశ్వరం మండల సమావేశం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం మండల సర్వసభ్య సమావేశం వైసిపి గ్రూపు విభేదాలతో రసాభాసగా సాగి మరోమారు తెరకెక్కింది. ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఎంపిటిసిలు బైఠాయించి నిరసన తెలిపారు. ఎంపిపి, ఎంఎల్ఎ గ్రూపుల ఎంపిటిసిల మధ్య వాగ్వాదంతో సమావేశం మొదలైంది. సోషల్ మీడియాలో ఎంపిటీసీలను సర్పంచుల కుక్కలతో పోల్చారని ఆరోపిస్తూ ఎంపిటీసీలు, సర్పంచులు ప్లకార్డులు చేపట్టి నినాదాలు చేశారు. ఎంపిపి మాట్లాడుతూ తన ప్రమేయం లేకుండా జరిగిన దని ఎంత చెప్పినా వినకుండా ఎండిఒ కార్యాలయం నుండి ఊరేగింపుగా బాలాజీ చౌక్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ఎంఎల్ఎ గ్రూపు నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో జడ్పిటిసి నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదె లోవరాజు ఎంపిటీసీలు ఇజనగిరి ప్రసాద్, సర్పంచులు బీసెట్టి అప్పలరాజు, కునపురెడ్డి వెంకటేశ్వరరావు, బుద్ధ సూర్యప్రకాశరావు, పి ఎ సి ఎస్ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు మహిళ ఎంపిటీసీలు, సర్పంచులు ఉన్నారు.

'వందే భారత్'కు అనువుగా ట్రాక్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభంకానున్న సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య కొత్తగా ఏర్పాటు చేసిన వందే భారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ రైలు రాక పోకలకు దీటుగా ట్రాకు తట్టుకునే విధంగా రైల్వే ట్రాక్ మర మ్మతులను శుక్రవారం సామర్లకోట రైల్వే స్టేషన్లో ప్రారం భించారు. విశాఖపట్నం నుండి సికింద్రాబాద్ కు 702 కిలోమీటర్ల దూరాన్ని కేవలం ఎనిమిదిన్నర గంటల సమయంలో సుమారు 82.58 కెఎంపిహెచ్ గా ప్రయాణి స్తుంది. దీని ఒత్తిడి తట్టుకునే విధంగా ప్రత్యేక అధునాతన యంత్ర పరికరాలతో ట్రాకుల పరిశీలన, మరమ్మతులు చేపడుతున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

ఈ పనులకు గాను వందలాదిమంది రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, టెక్నికల్ ఇంజనీర్లు సిబ్బంది సామర్లకోటకు చేరుకున్నారు. ఇప్పటికే వందే భారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ రైలు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరి తిరిగి గురువారం రాత్రి తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో విశాఖపట్నం నుంచి సామర్లకోటకు చేరుకొని విజయవాడ మీదుగా ట్రైల్ రన్ పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సామర్లకోట రైల్వే స్టేషన్లో ఒకటో నెంబర్ రైల్వే ట్రాక్లో మరమ్మతు కార్యక్రమాలు అధికారులు వేగవంతం చేశారు. అలాగే మూడో నెంబర్ ట్రాక్ను పరిశీలించి లోపా లను సరి చేయనున్నట్టు రైలు అధికారులు సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ రమేష్ సిబ్బందికి సూచనలు అందించారు.



రైలు ట్రాకు మరమ్మతుల పనులు పర్యవేక్షిస్తున్న స్టేషన్ మాస్టర్ రమేష్



'కోట'లో ఒక నిమిషం హాల్ట్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అసలు హాల్టు లేని రైల్వే స్టేషన్లో కొత్తగా ప్రారంభిస్తున్న వందే భారత్ ఎక్స్ప్రెస్ విశాక-సికింద్రాబాద్- విశాఖ రైలుకు మొదటి రోజు ఒక నిమిషం హాల్టును ఇస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 15వ తేదీన వర్చువల్గా ప్రధాని మోదీ ప్రారంభించనున్న ఈ రైలును 16వ తేదీ సోమవారం నుండి ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకురాను న్నారు. ఈ మేరకు రైలు నడిచే అన్ని స్టేషన్ల మధ్యలో హాల్టు లేని స్టేషన్లలో సైతం ఒక్క నిమిషం హాల్ట్ ఇమ్మని డిప్యూటీ సిఒఎం ఎసికె మురళీధర్ నాయర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు 16వ తేదీ సాయంత్రం 6.19 నిమిషాలకు వచ్చి ఒక్క నిమిషం ఆగి 6.20 నిమిషాలకు విశాఖవైపు వెళుతుంది. ప్రతీ ఆదివారం ఈ రైలుకు విరామం ఇచ్చారు. కేవలం ఆరు రోజులు మాత్రమే ప్రయాణిస్తుంది. సామర్లకోటలో ఒక నిమిషం హాల్టు ఇచ్చిన విషయాన్ని సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ ధ్రువీకరించారు.

నుకాలమ్మ ఆలయం స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక స్టేషన్ సెంటర్లో ఉన్న నూకాలమ్మ ఆలయాన్ని శుక్రవారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం వరకు నూకాలమ్మ ఆలయం శిథిలావస్థలో ఉండేది. దాంతో పట్టణ ప్రముఖులు, పరిసర ప్రాంతాల రైతులు అప్పటి దేవదాయ శాఖ మంత్రి పంతం పద్మనాభం ఆధ్వర్యంలో నూకాలమ్మ ఆలయాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, పట్టణ ప్రజల సహకారంతో నూతన ఆలయం నిర్మాణం చేశారు. అప్పట్లో ఆలయ సమీపంలో ఉన్న పెట్రోలు బంకు స్థలంపై వివాదం ఏర్పడటంతో బంకు నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు దేవాలయానికి అనుకూలంగా వచ్చింది. నూకాలమ్మ ఆలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని రెండేళ్ల క్రితమే ఆదేశాలు కూడా వచ్చాయి. అయితే ఇప్పటి వరకు ఆలయాన్ని స్వాధీనం చేసుకోక పోవడంతో శుక్రవారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు ఆధ్వర్యంలో ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు ఆలయానికి ఉన్న పాత పెట్రోలు బంకు స్థలాన్ని ఆలయానికి చెందిన షాపింగ్ కాంప్లెక్సును ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్ ఫణి కుమార్, ఈఓ జగన్నాథశ్రీనివాసు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జాతీయస్థాయి టిటి పోటీలు



విజేతలతో నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో ఐదు రోజులపాటు జరిగిన జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అకాడమీ చైర్మన్ వి.భాస్కరరామ్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజప్ప మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. మరో ముఖ్య అతిథి మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల యాజమానం విద్యారుథలను ప్రోత్సహిస్తూ టేబుల్ టెన్నిస్కు గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అకాడమీ చైర్మన్ భాస్కర్ రామ్ మాట్లాడుతూ పెద్దాపురంలో జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన ఘనత శ్రీ ప్రకాష్ ఎనర్జీ స్కూల్ యాజమాన్యానికి దక్కుతుందన్నారు. శ్రీ ప్రకాష్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ బాల బాలికలకు వేరువేరుగా అండర్ -14 అండర్ -19 విభాగాలుగా డబుల్స్,సింగిల్స్ పోటీలు నిర్వహించారన్నారు.ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరూ అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. క్రీడలకు చీఫ్ రిఫరీ సూర్యారావు, అసిస్టెంట్ చీఫ్ రిఫరీ వేణుగోపాల్, సాంకేతిక బందం విశేష తోడ్పాటును అందించారన్నారు. ఈ సభలో విజేతలందరికీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కర్ర సాము, రోప్ స్కిప్పింగ్ వంటి విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సభలో తూర్పుగోదావరి జిల్లా ఒలెంపిక్ అసోసియేషన్ సెక్రటరీ పద్మనాభం పాల్గొన్నారు.



విశాఖపట్నం జిల్లా జట్టుకు ట్రోఫీ నగదు బహుమతి అందిస్తున్న శివన్నారాయణ

వాలీబాల్ టోర్నీ విజేత విశాఖ

ప్రజాశక్తి - తాళ్లరేవు

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పెద్ద పేటలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విశాఖపట్నం జిల్లా జట్టు విజేతగా నిలువగా, కాకినాడ జిల్లా పి. మల్లవరం జట్టు రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకుంది. మూడవ స్థానాన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానం జట్టు, నాలుగో స్థానాన్ని తూర్పుగోదావరి జిల్లా జట్లు దక్కించుకున్నాయి. పోటీల్లో విజయనగరం, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు పాల్గొన్న అన్ని జట్లకు ట్రోఫీ, నగదు బహుమతులను ముమ్మిడి వరం మార్కెట్ కమిటీ చైర్మన్, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారా యణ అందజేశారు. కార్యక్రమంలో కోరంగి మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీనరసింహరాజు, యువ నాయకులు కుడుపూడి శ్రీనివాస్, దున్న శ్రీకాంత్, పిల్లి వీరనాగు, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, ఎడ్ల కుటుంబ రావు, సోను, పంచాయతీ వార్డు సభ్యులు, ఫిజికల్ డైరెక్టర్ గుత్తుల మల్లేశ్వరరావు, స్థానిక యువకులు పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళంగా చెక్కు అందజేస్తున్న దాత వెంకటరాజు

నిత్యాన్నదానానికి రూ. 5.11 లక్షల విరాళం

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామ ప్రముఖులు కర్రి సత్య నారాయణ కుమారుడు కర్రి వెంకటరాజు కుటుంబం సామర్లకోట కుమార రామ భీమేశ్వర ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.5,11,116 లు విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని శుక్రవారం పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సమక్షంలో ఆలయ ఇఒ డి.నాగమల్లేశ్వరరావుకు చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబాన్ని ఎంఎల్ఎ చినరాజప్ప, రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షులు దవులూరి సుబ్బారావులు అభినందించారు. కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్ బలుసు వాసు, నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, తాతపూడి కష్ణవంశీ, పడాల వీరబాబు, ఆలయ పండితులు, బిక్కిన సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

మిల్వెన్ జోన్స్కు ఘన నివాళి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ అయిన లయన్స్ క్లబ్ ను స్థాపించిన ఫౌండర్ మిల్వేన్ జోన్స్ జయంతి సందర్భంగా శుక్రవారం సామర్లకోట లయన్స్ క్లబ్ శ్రీ భీమేశ్వర ఆధ్వర్యంలో స్థానిక క్లబ్ భవనంలోనూ, పట్టణంలోను నిరుపేదలకు దుప్పట్లు, చీరలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు సిరివరపు సుధారాణి, కార్యదర్శి సేపేనీ సురేష్, డిస్ట్రిక్ట్ చైర్మన్ చిత్తలూరి వీర్రాజు (రాజా) జోన్స్ చిత్రం పటం వద్ద నివాళులర్పించి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ నాయకులు కర్రి ఆదినారాయణ రెడ్డి, మార్త్రాల విజయభాస్కర్ రెడ్డి, గుండు శంకర్రావు, యార్లగడ్డ పెదబాబు పాల్గొన్నారు.



సామర్లకోటలో పేదలకు దుస్తులు అందిస్తున లయన్స్ ప్రతినిధులు

పేదలకు లయన్స్ క్లబ్ దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి పురస్కరించుకుని ఏలేశ్వరంలో పేదలకు దుప్పట్లు బట్టలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. జోన్ జీవిత విశేషాలను, ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జ్యోతుల శ్రీనివాస్, కందుల ప్రభాకర్, ఉడతల రమణారావు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ వనమాడి

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే జీఓ1

ప్రజాశక్తి - కాకినాడ

వైసిపి ప్రభుత్వంపై ప్రజలలో వచ్చిన వ్యతిరేకతను తట్టుకోలేకే ప్రజా సంఘాలు ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు జగన్ ప్రభుత్వం జీవో నెంబర్.1 తీసుకువచ్చిందని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో విమర్శించారు. ఈ సందర్భంగా సమావేశంలో జీఓ1, జనవరి 18న జరగ బోయే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలపై చర్చించారు. ఈనెల 14 వ తేదీన జీవో నెంబర్ -1 కు వ్యతిరేకంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భోగి మంటలలో జీవో నెంబర్ వన్ ప్రతులను తగలబెట్టాలని సూచించారు. జనవరి 18న ఎన్టీఆర్ వర్ధంతిని ప్రతి డివిజన్లో ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. సమా వేశంలో టిడిపి నాయకులు గదులు సాయిబాబా, ఎంఎ తాజుద్దీన్, ఖాన్, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, అమన్ జైన్, అంబటి చిన్న, చింతలపూడి రవి, దండుప్రోలు నాగబాబు, కె వి ఎస్ ఎన్ మూర్తి, మేడిశెట్టి చిన్ని కోడూరు పెద్ద, సయ్యద్ అలీ పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాల్లో ప్రగతి చూపాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో తహశీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ లతో ఆర్డిఒ బివి రమణ శుక్రవారం సమావేశం నిర్వహిం చారు. జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షకు సంబంధించి రీసర్వే పూర్త యిన గ్రామాలలో భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాల న్నారు. ముఖ్యంగా కాకినాడ నుండి రాజానగరం వరకు నిర్మించ తలపెట్టిన భారత మాల జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, రెవెన్యూ ధ్రువపత్రాలు సకాలంలో మంజూరు చేయాలని, పండగల నేపథ్యంలో ఏ విధమైన కోడిపందేలు, జూద క్రీడలు జరగకుండా పోలీసు వారితో సమ న్వయం చేసుకోవాలన్నారు. కొత్త సినిమాలు విడుదల నేపథ్యంలో టికెట్లకు సంబంధించి ఏ విధమైన బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా థియేటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి సినిమా థియేటర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎఒ వరహాలయ్య. తహశీల్దార్లు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ లు పాల్గొన్నారు.

ఉప్పంగల ఎంపిటిసి మాజీ సభ్యులు ఆదిలక్ష్మి మృతి

ప్రజాశక్తి - తాళ్ళరేవు



కాదా ఆదిలక్ష్మి, (ఫైల్)

ఉప్పంగల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, వైసిపి నాయకురాలు కాదా ఆదిలక్ష్మి (71) శుక్రవారం మృతిచెందారు. ఆమెకు భర్త సూర్యారావు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు కాదా శ్రీనివాస్ ప్రస్తుతం వైసిపి ఎంపిటిసిగా సేవలం దిస్తున్నారు. టిడిపి అధికారంలో ఉన్న సమయంలోనే వైసిపి తరపున మండలంలోనే అత్యధిక మెజారిటీతో ఆదిలక్ష్మి గెలుపొంది రికార్డ్ సృష్టించారు. ఆమె 2014 నుంచి 2019 వరకు ఎంపిటిసి సభ్య రాలుగా సేవలందిం చారు. ఆదిలక్ష్మి మృతిపై ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఎంపీపీ రాయుడు సునీత, జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, కుడుపూడి శివన్నారాయణ, ఉప్పంగల సర్పంచ్ శాఖ శంకరుడు, వైసిపి గ్రామ కమిటీ కన్వీనర్ దవులూరి శ్రీరామ్మూర్తి, నాయకులు బిళ్ళకుర్తి కొండలరావు, దడాల సువర్ణలత సంతాపం తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు బీమా సొమ్ము పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 9,11 వార్డుల పరిధిలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబ సభ్యు లకు ఒక్కొక్కరికి రూ లక్ష చొప్పున మంజూరైన బీమా సొమ్మును శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్ర మంలో మున్సిపల్ కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, బలుసు భీమరాజు, ఆరేళ్ల వీర రాఘవ, కొట్టి పవన్ కుమార్, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

పెద్దాపురం ఎస్ఐగా సురేష్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఐగా వెలుగుల సురేష్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై పెద్దాపురం ఎస్ఐగా వచ్చారు. ఇప్పుడు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సురేష్ గతంలో సంవత్సరం పాటు పెద్దాపురం ఎస్ఐగా పనిచేశారు.

ఏరియా ఆసుపత్రిలో ఆధునిక ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి -రామచంద్రపురం



ల్యాబ్ ను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం పట్టణంలో గల ఏరియా ఆస్పత్రిలో ఆధునిక ల్యాబ్ను, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్ ను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. సామాన్యులు అందరికీ ఉపయోగపడే విధంగా అన్ని వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారని అన్నారు. రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో ఆధునిక ల్యాబ్ వల్ల అనేక పరీక్షలు ఇక్కడ నిర్వహించే అవకాశం ఉందన్నారు. సామాన్యులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.వీరభద్రుడు, వైద్యులు ప్రవీణ్, మున్సిపల్ చైర్పర్సన్ శ్రీదేవి, ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రవీణ్ పుట్టినరోజు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్



శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ఆంధ్ర సేవా రత్న, ఉపాధ్యాయ జెఎసి రాష్ట్ర నాయకులు కరాటం ప్రవీణ్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం రెడ్డిపల్లి, అమలాపురం, ఉప్పలగుప్తం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల వద్ధులు, వికలాంగులకు, పేదలకు నగదు సాయం, దుస్తులు, పండ్లు, అందించారు. పలువురు ప్రముఖులు ప్రవీణ్కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేకులు కట్ చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.నరసింహ రావు, ప్రిన్సిపల్ కరాటం మనోహర్, జెఎసి .కన్వీనర్ బండారు రామ్మోహన్ రావు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని తంటికొండ శివారు పేకాట ఆడుతున్న ఆరుగునికి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు గోకవరం ఎస్ఐ శివ నాగబాబు, సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12,720 నగదు, పేకలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలలను మన-బడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అసౌకర్యము లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్స శుక్లా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ హాలులో విద్యాశాఖకు చెందిన మండల విద్యాశాఖ అధికారులు జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ కు చెందిన ఎపిఎంలతో సమావేశం నిర్వహించి బాల్యవివాహాలు నిరోధం, బడి బయట పిల్లలు లేకుండా చర్యలు ఇత్యాది అంశా లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మన-బడి నాడు-నేడు రెండో దశ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ఎంఇఒలు పర్యవే క్షించాలని ఆదేశించారు. బాల్య వివాహాలను ఎపిఎం, ఐసిడిఎస్ సిబ్బంది సహకారంతో నిరోధానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పిల్లలు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లడం, వయసు పెరగడంతో బడిమానివేయడం, తల్లిదండ్రులు తమతో పాటు పిల్లలను పనులకు తీసుకువెళ్లడం వంటి వివరాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించే విధంగా విద్యాబోధన అనేది పటిష్టంగా ఉండాలన్నారు. నవోదయ ప్రిన్సిపల్ రామిరెడ్డి మాట్లాడుతూ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతికి ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఈ నెల 31 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఎంఇఒలు తమ తమ పాఠశాలలో ఐదో తరగతి విద్యను అభ్యసించుచున్న వారి ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేయించాలని కోరారు. విద్యార్థు లలో నవోదయ పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఎ పీడీ వి.శివ శంకర్ ప్రసాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వి.రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో రాత్రి వేళల్లో అల్లరి మూకల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు, వ్యాపా రులు కోరుతున్నారు. కాకతీయ కల్యాణ మండపం వద్ద నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించేశారన్నారు. అలాగే గురువారం రాత్రి బస్టాండ్ ఎదురుగా హోటల్ వద్ద ఉన్న గ్యాస్ పొయ్యిని ధ్వంసం చేశారన్నారు. పోలీసులు స్పందించి పెట్రోలింగ్ పెంచాలని, అల్లరి మూకలను కట్టడి చేయాలన్నారు.

'ఎంఎల్ఎ మాట్లాడినవన్నీ అసత్యాలే'

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేటలో బంగారం గుడి వద్ద సిసి రోడ్డు ప్రారంభానికి విచ్చేసిన ఎమ్ఎల్ఎ చిర్ల జగ్గి రెడ్డి స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో సభలో మాట్లాడినవన్నీ అసత్యాలేనని టిడిపి మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. టిడిపి నాయకులు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్ల పాటు కనీసం మరమ్మతులు చేయకుండా రోడ్డును దుస్థితి పాలు చేసిన వైసిపి నేత ఇప్పుడు నీతులు చెబుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి-కొత్తపేట

సంక్షేమం, అభివృద్ధి వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు.కొత్తపేటలో పాత రామాలయం నుంచి కాపు కళ్యాణ మండపం వరకు 450 మీటర్ల మేర రూ.కోటీ నలభై లక్షలతో నిర్మించిన ఆర్అండ్బి రోడ్డు, డ్రైన్ను ఆయన శుక్రవారం ప్రారంభించారు.ఈ సంధర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో చేయలేకపోయిన కొత్తపేట బంగారమ్మ గుడి ఆర్ అండ్ బి రోడ్డును సిసి రోడ్డుగా నిర్మించి దానికి రెండు వైపులా డ్రైన్ నిర్మాణం సిఎం జగన్ పాలనలో సాధ్యమైందన్నారు. సంవత్సరం క్రితం సంక్రాంతి కానుకగా రావులపాలెం నుండి పలివెల వంతెన వరకు సుమారు 10 కి.మీ రోడ్డును రూ.8 కోట్ల 30 లక్షలతో నిర్మించి 2022 సంక్రాంతి కానుకగా అందించామన్నారు, వైసిపి ప్రభుత్వ హయాంలో కొత్తపేట నియోజకవర్గంలో ఎక్కువ రోడ్లు నిర్మించామన్నారు.



ల్యాబ్ ను ప్రారంభిస్తున్న మంత్రి వేణు